వృద్ధులను జాగ్రత్తగా కాపాడాలి: మంత్రి సీతక్క



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

చందానగర్, మార్చి9(ఆంధ్రజ్యోతి): వృద్ధులను జాగ్రత్తగా, కంటికిరెప్పలా కాపాడాల్సిన బాధ్యత వారి సంతానంపై ఉందని మంత్రి సీతక్క అన్నారు. మలబార్ చారిటబుల్ ట్రస్టు, రిహాబిలిటేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చందానగర్‌లో గ్రాండ్ మా హోం, హంగారి ఫ్రీ వరల్డ్ వృద్ధాశ్రమాన్ని శనివారం ప్రారంభించారు. మలబార్ గోల్డ్ చైర్మన్, ఎంపీ అహ్మద్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, సమన్వయకర్త రఘునందన్‌రెడ్డితో కలిసి మంత్రి కార్యక్రమంలో పలువురు వృద్ధులతో మాట్లాడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన పిల్లలు కొందరు వారికి దూరంగా ఉండాలనే భావన సరికాదన్నారు. మలబార్ గోల్డ్ వైస్ చైర్మన్ కెపి అబ్దుల్‌సల్లార్‌తో పాటు సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో ఈటల రాజేందర్

ఉమామహేశ్వర ఆలయంలో అన్నదానం

షాపూర్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని ఉమామహేశ్వర ఆలయంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి, బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాగరణలు, భరతనాట్యం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రికి ఉపవాసం ఉండే భక్తులందరికీ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన అన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ధర్మపురిక్షేత్రంలో కూచిపూడి నృత్యప్రదర్శన

మియాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం రాత్రి శివరాత్రిని పురస్కరించుకుని జాగరణ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గొట్టి సత్యవాణి ఆధ్వర్యంలో నృత్యాంజలి కూచిపూడి అకాడమి ప్రదర్శించిన నృత్యప్రదర్శన సందడిగా సాగింది. పెద్దసంఖ్యలో భక్తులు తిలకించారు.



ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

రాయదుర్గం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి గోపన్‌పల్లి తండాల్లో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా వేగంగా రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను కోరారు. అనంతరం తండాలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

'కబ్జాకు గురైన చెరువులను కాపాడండి'

జీడిమెట్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కబ్జాకు గురైన చెరువులను పరిరక్షించాలని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. దుండిగల్ చిన్నదామెర చెరువు కబ్జాలను తొలగించడాన్ని సీపీఐ స్వాగితిస్తుందన్నారు. జగద్గిరిగుట్ట, గాజులరామారం, జీడిమెట్ల, సూరారం ప్రాంతంలో కబ్జాకు గురైన చింతల్‌చెరువు, బంధంచెరువు, చర్ల్‌గాగిల్లాపూర్‌లోని లక్కకుంటా కసారం చెరువు, ఫాక్స్‌సాగర్, నాలా, సూరారం లింగం చెరువు, ఎన్నా చెరువు, కట్టుకాలువ, వడ్డేవానికుంట, షైబుచెరువు, చిన్నబంధంచెరువు, అంబీర్‌చెరువు ఇతర చెరువుల్లో నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కోట్లవిలువచేసే ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

గచ్చిబౌలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో బాటసారులు, వాహనదారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం చేస్తాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. లింగంపల్లి సురభికాలనీ కృపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రవికుమార్‌యాదవ్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లేశ్, శేఖర్, రమేష్, శ్రీను, వెంకటేష్, రమణకుమార్, జితేంద్ర, వెంకటరావు, పూర్ణ, చంద్రశేఖర్, శివకుమార్, రవి, జితేంద్ర, నరసయ్య, సుధా, వీణ విజయవాణి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్‌యాదవ్



కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో వద్ద బాణాసంచా కాల్చుతున్న ఆర్టీసీ సిబ్బంది

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

ఫతేనగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. పెండింగ్‌లో పీఆర్‌సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మజ్దూర్ యూనియన్ నాయకులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, కూకట్‌పల్లి చైర్మన్ మురళీకృష్ణ, అధ్యక్షుడు ఐలయ్య, వైస్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్‌గుప్తా, శ్రీనివాస్, లక్ష్మణ్, మధు, వెంకటేష్‌గౌడ్, డిపో నాయకులు, కార్మికులు సీఎంకి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి

'నా ఊహాలోకం' కథలు ముందుతరాలకు సందేశం

చిక్కడపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నా ఊహాలోకం కథలు ముందుతరాలకు సందేశంగా నిలుస్తాయని ప్రముఖ సాహితీవేత్త డా.నందిని సిధారెడ్డి అన్నారు. బంధుత్వాలలో తప్పులను గుర్తుంచుకుంటే అనుబంధాలు మిగలవని మనుషులుగా కూడా గుర్తింపు కోల్పోతారని ఆయన పేర్కొన్నారు. తపస్వి మనోహరం, మయూఖ అంతర్జాతీయ పత్రిక ఆధ్వర్యంలో కట్టెకోల విద్యుల్లత రచించిన 'నా ఊహాలోకం' కథా సంపుటి ఆవిష్కరణ సభ శనివారం రాత్రి త్యాగరాయగాన సభలో జరిగింది. పుస్తకాన్ని సిధారెడ్డి ఆవిష్కరించగా కొండపల్లి నిహారిణి, డా.నాశేశ్వరం శంకరం, అవధానులు విజయలక్ష్మి, జగన్నాథరావు, సంస్థాపకుడు కార్తీక్ నిమ్మగడ్డ, గేయ రచయిత గోపాల్ ఆచార్య పాల్గొన్నారు.

పొంచిఉన్న ముప్పు

- బహిరంగ ప్రదేశాల్లో పరిశ్రమల వ్యర్థాల కాల్చివేత
- విషవాయువులు పీల్చిన వారికి శ్వాసకోశ వ్యాధులు

బాలానగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నాలాల్లో వ్యర్థ రసాయనాల పారబోత, కలుషిత నీటి సమస్య, వాహనాల నుంచి వచ్చే కాలుష్యంతో బాలానగర్ పారిశ్రామిక వాడల ప్రజలకు ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోంది. రోడ్ల పక్కన మట్టి కుప్పలు, భవన నిర్మాణాల వ్యర్థాల డంపింగ్, పేరుకు పోతున్న చెత్తాచెదారంతో స్థానికులు పడరాని పాట్లుపడుతున్నారు. మరికొందరు పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థాలను బహిరంగంగా దహనం చేస్తున్నారు. దీని నుంచి వస్తున్న పొగ, విషవాయువులతో ఊపిరాడడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బాలానగర్ సీబీఐ పోస్టాఫీసు రోడ్డులో పరిశ్రమల వ్యర్థాలను కొందరు కాల్చివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పోస్టాఫీసు రోడ్డులో దహనం చేస్తున్న పరిశ్రమల వ్యర్థాలు, చెత్తాచెదారం

● పరిశ్రమల చెత్త కాల్చడం ప్రమాదకరం

బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడ రైల్వేట్రాకు ఎస్‌ఆర్‌ఎస్‌పీ స్కూల్ ఎదుట, ఫతేనగర్ డివిజన్ దీన్‌దయాల్‌నగర్ బ్రిడ్జి, పాత ఎయిర్ పోర్టు రోడ్డు, ఖేతాన్ ఫ్యాన్స్ నాలా పక్కన, ఫతేనగర్ ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే ట్రాకు సమీపంలో పరిశ్రమల వ్యర్థాలు వేస్తున్నారు. ఈ చెత్త కుప్పలను నిత్యం తగుల బెడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పరిశ్రమల వ్యర్థాలను కాల్చడంతో చెత్తలో ఉండే పాలిథీన్ సంచులు, ఇతర వ్యర్థాలు కాలి హైడ్రోకార్బన్లు వెలువడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ హైడ్రో కార్బన్ల ప్రభావంతో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారిపోతుంది. కండ్లు తెరవలేనంతగా మంట ఏర్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్తను తగుల బెడుతున్నారని అధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యుల మాట

చెత్త, పరిశ్రమల వ్యర్థాల కాల్చివేతతో పొగ, దుమ్ము, ధూళితో పాటు విషవాయువులు వెలువడుతాయని వైద్యులు అంటున్నారు. చెత్తను కాల్చినప్పుడు కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, అమ్మోనియా, క్లోరిన్, హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి విషవాయువులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని హెచ్చరిస్తున్నారు.

- **కార్బన్ మోనాక్సైడ్ :** శరీర జీవకణాలకు ఆక్సిజన్ అందక పోవడంతో అపస్మారక స్థితికి చేరుకుంటారు, తీవ్రత పెరిగితే మరణానికి దారితీస్తుంది.
- **సల్ఫర్‌డై ఆక్సైడ్ :** శ్వాసకోశాల్లో ఇబ్బంది, బ్రాంకైటిస్
- **నైట్రోజన్ డై ఆక్సైడ్ :** శరీర జీవకణాలకు ఆక్సిజన్ అందదు.
- **అమ్మోనియా :** శ్వాసకోశ విభాగాలకు చికాకు, మంట
- **క్లోరిన్ :** ఊపిరితిత్తులు, కళ్లల్లో మంట
- **హైడ్రోజన్ సల్ఫైడ్ :** శ్వాసకోశాలకు పక్షవాతం, తక్షణమే మూర్ఛ.
- **హైడ్రో కార్బన్స్:** కేంద్ర నరాల వ్యవస్థకు తీవ్రనష్టం కలుగజేస్తుంది.
- **ధూళిరేణువులు :** శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతాయి.

లారీ, కారు ఢీకొని ఒకరి మృతి



విజయ్ శేఖర్(ఫైల్)

పూడూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అతివేగం అజాగ్రత్తగా వస్తున్న లారీ కారును ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని సోమన్‌గుర్తి గేటు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన విజయ్ శేఖర్(40), పూడూరు మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన విజయ భార్యాభర్తలు. అయితే శుక్రవారం విజయ్ శేఖర్ తల్లి శివపార్వతి, భార్య విజయలను తీసుకుని పరిగి మండలం బసిరెడ్డిపల్లిలోని శివాలయానికి వచ్చారు. వారిని ఆలయంలో వదిలేసి విజయ్ తిరిగి హైదరాబాద్ వెళ్లాడు. శనివారం తిమ్మాపూర్ వెళ్లిన తల్లి, భార్యను తిరిగి హైదరాబాద్ తీసుకెళ్లేందుకు విజయ్ కారు (ఏపీ029బీటీ5813)లో పూడూరుకు వెళ్తున్నాడు. సోమన్‌గుర్తి గేటు సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న లారీ (కేఏ 32 సీ 5862) విజయ్ ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతింది. కారు ఇంజన్ వేరుపడి దూరంగా పడింది. ఈ ప్రమాదంలో విజయ్ శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రవీందర్‌రెడ్డికి పరామర్శ

బాలానగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలానగర్ డివిజన్ జనసేన వైస్ ప్రెసిడెంట్ చెన్ను రవీందర్‌రెడ్డిని నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ శనివారం పరామర్శించి ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు. జనసేన సీనియర్ నాయకుడు కొల్లా శంకర్, గడ్డం నాగరాజుకిషోర్, కళింగ్‌వెంకటరమణ, గంటల నాగభూషణం, పులగం సుబ్బు ప్రేమ్‌కుమార్ వెంట ఉన్నారు.



రవీందర్‌రెడ్డి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ప్రేమ్‌కుమార్

బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



బహిరంగ సభకు తరలి వెళ్తున్న బండి రమేష్, నాగిరెడ్డితో పార్టీ శ్రేణులు

ఓల్డుబోయిన పల్లి, మార్చి 9 (ఆంధ్ర జ్యోతి): కొంపల్లి కండ్లకోయ వద్ద శనివారం నిర్వహిస్తున్న మల్కాజిగిరి పార్లమెంట్ స్థాయి బహిరంగ సభకు బాలానగర్, ఫతేనగర్, ఓల్డుబోయినపల్లి డివిజన్‌లకు చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతాప్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రమేష్, సంతోష్‌కుమార్, అశోక్ ముదిరాజ్, ఇంద్రజిత్, అస్లాం, చున్ను పాష వందల సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లారు.

సొంతూరికి వెళ్తూ.. మృత్యువాత

చందానగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సొంతూరికి వెళతానని ఇంటి నుంచి బయల్దేరిన ఓ వ్యక్తి మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన చందానగర్ పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని కలబురిగి పట్టణానికి చెందిన రామలింగప్ప(55) ఐదేళ్ల క్రిందట జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. భార్య, కుమార్తెతో కలిసి రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్‌లో ఉంటూ కూలీపని చేసుకుంటున్నాడు. కొంతకాలంగా రామలింగప్ప తాగుడుకు బానిసయ్యాడు. శుక్రవారం మద్యం సేవించిన రామలింగప్ప, తనకు ఇక్కడ ఉండడం ఇష్టం లేదని, సొంతూరికి వెళతానని కూతురికి చెప్పి వెళ్లాడు. ఊరికి వెళతానని చెప్పిన భర్త నుంచి ఫోన్ రాకపోవడంతో అతని భార్య శనివారం సొంతూరిలో ఉన్న బంధువులకు ఫోన్ చేసి రామలింగప్ప గురించి వాకబు చేయగా అక్కడికి రాలేదని వారు సమాధానం చెప్పారు. దీంతో తల్లి, కూతురు కలిసి తమ నివాసానికి చుట్టుపక్కల రామలింగప్ప గురించి వెతికారు. లింగంపల్లి నుంచి పాపిరెడ్డి కాలనీకి వెళ్లే రహదారి పక్కనే ఉన్న మురుగుకాల్వలో శవమై కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఆరోఫేజ్‌లో మహిళా దినోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ఆరోఫేజ్ అబ్దుల్ కలాం పార్కులో కల్యాణి, రేఖారాజు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆక్యుపంచర్ థెరపిస్ట్ డా.శశిరేఖ ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన గేమ్స్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డెంటిస్ట్ దీప్తి, డా.సహీన్, డా.లక్ష్మీప్రియ, ఫిజియోథెరపిస్ట్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి మహర్దశ

- రూ. 4.40 కోట్లతో నూతన కల్యాణ, అన్నదాన మండపాలు
- కేంద్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో త్వరలో పనులు ప్రారంభం



నూతన భవన నమూనా



ఎల్లమ్మ ఆలయం వెనుకాల ఉన్న పాత కల్యాణ మండపం

అమీర్‌పేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ ఆలయానికి మహర్దశ పట్టనుంది. భక్తుల సౌకర్యార్థం అన్నదాన, కల్యాణ మండపం అందుబాటులోకి రానున్నాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎట్టకేలకు స్వదేశ్ దర్శన్ పథకంలో భాగంగా కేంద్ర టూరిజం శాఖ బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ ఆలయం ప్రాంగాణంలో అన్నదాన, కల్యాణ మండప నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనుల నిర్మాణానికి గాను రూ.4.40 కోట్లను మంజూరి చేసింది. దీంతో బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ ఆలయ ప్రాంతంలో రూపురేఖలు మారనున్నాయి. ఇప్పటికే బోనం కాంప్లెక్స్ వెనుకాల ఆధునిక హంగులతో మల్టీ పర్పస్ పార్కింగ్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం బోనం, వీఐపీ కాంప్లెక్స్, కల్యాణ మండపం ఉండగా దీని స్థానంలో అధునాతన సౌకర్యాలతో మూడు అంతస్తుల భవనం నిర్మాణం కానుంది.

కల్పించనున్న సదుపాయాలు

బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో ఉన్న బాబులాల్ అగర్వాల్ కల్యాణ మండపం స్థానంలో నూతనంగా నిర్మించనున్న భవనంలో పలు వసతులు కల్పించనున్నారు. ఈ మేరకు కేంద్ర టూరిజం శాఖ పూర్తి వివరాలను వెల్లడించింది. జీ ప్లస్ మూడు అంతస్తుల్లో నిర్మించనున్న ఈ భవనంలోని మొదటి అంతస్తులో 154 చదరపు అడుగు మీటర్లలో అన్నదానం హాల్, వంట గది, స్టోర్స్, హ్యాండ్ వాష్, తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. రెండో అంతస్తులో కూడా అన్నదానం హాల్, కిచెన్ తాగునీటి సౌకర్యం, మూడో అంతస్తులో ఫలహార శాల (కెఫెటేరియా), క్యాంటీన్, కిచెన్, హ్యాండ్‌వాష్, తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. ఇక గ్రౌండ్ ఫ్లోర్‌లో స్త్రీలు, పురుషులకు వేరువేరుగా బయోటాయిలెట్లు నిర్మించనున్నారు. తీర్థయాత్ర టికెట్ కౌంటర్, ఏటీఎం సౌకర్యం, ఇదే ఫ్లోర్‌లో టూవీలర్లకు పార్కింగ్ సౌకర్యం, కూర్చునేందుకు బెంచీలు, లిఫ్ట్ సౌకర్యం, వేచి ఉండే గదితోపాటు ఆటోమేటిక్ ఫైర్ అలారం సిస్టమ్, రూఫ్ టాప్‌లో సోలార్ ప్యానెళ్లు, వర్షపు నీటి గుంతలు, డ్రైనేజీ పైప్‌లైన్, ప్రహరీ గోడ, గేట్లు, వాటర్ సంపు, ఓవర్ హెడ్ ట్యాంక్, డస్ట్‌బిన్, వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సైన్ బోర్డులతో పాటు ఆధునిక సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

విజేతలకు జ్ఞాపికలు అందజేత

ఫతేనగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫతేనగర్‌లో ఉదయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో విజేతలకు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సాయినాథ్‌గౌడ్, తేజశేఖర్, రవీంద్రనాథ్‌గౌడ్, రోహిత్, రాకేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామలింగేశ్వర మున్నూరుకాపు సంఘం కీసరలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యూత్ కన్వీనర్ పుప్పాల భాస్కర్ పాల్గొన్నారు. నిర్వాహకులు కీసర కమిటీ మామిళ్ల శ్రీనివాస్, మహేందర్, దేవరాజ్, మురారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

\- షాపూర్‌నగర్, ఆంధ్రజ్యోతి

రైలు ఢీకొని కూలి మృతి

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని కూలి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కందిగల్ గేట్ వద్ద నివాసం ఉంటున్న రాణాప్రతాప్(22) కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కందిగల్ గేట్ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ జిల్లాల క్యారమ్ పోటీలు ప్రారంభం

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర 51వ రాష్ట్ర, అంతర్ జిల్లా క్యారమ్ పోటీలు తెలంగాణ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్, రంగారెడ్డి, మెదక్, మల్కాజ్‌గిరి జిల్లాల క్యారమ్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ప్రగ్నా ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ముషీరాబాద్‌లోని మల్లికార్జుననగర్‌లో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్ రాజు, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి శోభన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముషీరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉప్పు సుధాకర్, సాయికృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్యారం పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

డిప్యూటీ మేయర్, కార్పొరేటర్‌పై అట్రాసిటీ కేసు

నిజాంపేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఓ దళిత కుటుంబాన్ని కులం పేరుతో దూషించి, వారి ప్లాట్లను కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతూ దాడికి పాల్పడిన నిజాంపేట్ బీఆర్‌ఎస్ నాయకులు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, 8వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌రెడ్డిలపై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ గ్రామానికి చెందిన తులసి నర్సింహ కుటుంబానికి సర్వేనెంబర్ 191లో ప్రభుత్వం 60 గజాల చొప్పున 180 గజాల స్థలానికి పట్టాలు ఇచ్చింది. గతంలో ధన్‌రాజ్‌యాదవ్, సురేష్‌రెడ్డిలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నర్సింహ స్థలాన్ని కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టారు. ప్రశ్నించిన నర్సింహను కులంపేరుతో దూషించి, దాడికి పాల్పడి బెదిరించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా నిర్మాణాలను తొలగించారు. అయినా వారు కబ్జాలో ఉంటూ దళిత కుటుంబాన్ని బెదిరిస్తున్నారు. 15 రోజుల క్రితం స్థలాన్ని ఖాళీ చేయాలని అడగగా బాధితులపై దాడి చేసి స్థలం వద్దకు వస్తే చంపేస్తామని బెదిరించారని పేర్కొన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు ఇద్దరు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ యాక్టు కింది కేసులు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దళిత కుటుంబానికి చెందిన స్థలం

చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్న సినీనటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన నివాసంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శనివారం కలిశారు. చంద్రశేఖర్‌రెడ్డికి టికెట్ కేటాయిస్తే నాయకులందరూ కలిసి కట్టుగా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గూడెపు నాగరాజు, జిట్టా సునీల్ కుమార్‌యాదవ్, రాచమళ్ల శేఖర్‌గౌడ్, రాంప్రకాష్‌శర్మ, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు



చంద్రశేఖర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

● కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నేతలు

బాలానగర్ : కూకట్‌పల్లి యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం కాంగ్రెస్ నాయకుడు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

కేపీహెచ్‌బీలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

కూకట్‌పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీకాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మూడు నిర్మాణాలను కూల్చివేశారు. జీ ప్లస్ 2 అనుమతులతో ఆరు అంతస్తులు నిర్మిస్తున్నట్లు జోనల్ కమిషనర్ దృష్టికి రావడంతో చర్యలు చేపట్టారు. జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు జోనల్ విభాగానికి చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం బృందం శనివారం కూల్చివేతలు చేపట్టింది. కాలనీలోని 1, 2, 4వ రోడ్లలోని మూడు అక్రమ నిర్మాణాలకు సంబంధించిన స్లాబ్‌లు, గోడలను కూల్చివేశారు. జీహెచ్‌ఎంసీ అనుమతులకు మించి అదనపు అంతస్తులు నిర్మించిన భవనాలపై కఠిన చర్యలు ఉంటామని జోనల్ కమిషనర్ హెచ్చరించారు. నిర్మాణదారులు జీహెచ్‌ఎంసీ అనుమతుల మేరకు నిర్మాణాలు చేపట్టాలని కోరారు.



కేపీహెచ్‌బీకాలనీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున సిబ్బంది

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

వివేకానందనగర్‌కాలనీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ మాధవరంకాలనీకి చెందిన చంద్రమౌళి అనే లబ్ధిదారుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విడుదలైన రూ.15వేల విలువైన చెక్కును శనివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సప్తగిరికాలనీలోని తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల భద్రయ్య, రమేష్, తిరుపతిరెడ్డి, కాశీనాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ